సాక్షి
పల్నాడు
శుక్రవారం। 3। మార్చి। 2023



సజావుగా పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక గుంటూరు జిల్లాలో గురువారం 94.01 శాతం పంపిణీ పూర్తయింది. సాయంత్రానికి 2,38,058 మందికి రూ.65.40 కోట్ల నగదు అందజేశారు.



ఆర్టీసీ బస్సు బోల్తా

రేపల్లెరూరల్: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని కారుమూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎవరికీ ప్రమాదం జరగలేదు.



ఉగాదికి నిర్మాణాలు పూర్తిచేయాలి

అద్దంకిరూరల్: గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తిచేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం బొమ్మనంపాడు జగనన్నలే అవుట్‌ను పరిశీలించారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 21 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శాంతి విశాల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లోని ఖాళీ సీట్లు, అభ్యర్థుల విద్యార్హతలు తదితర వివరాల కోసం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసంhttps://apgpcet.apcfss.in, https://apgpcet. apcfss.in/inter వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

నేడు జెడ్పీలో భేటీ కానున్న స్థాయీ సంఘాలు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాలు శుక్రవారం భేటీ కానున్నాయి. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకుగాను 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జెడ్పీలోని ఆమె ఛాంబర్‌లో జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. 3వ స్థాయీ సంఘానికి సంబంధించి వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, 5వ స్థాయీ సంఘం స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, 6వ స్థాయీ సంఘం సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నారు. స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కానున్న అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతితోపాటు గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర వివరాలతో హాజరు కావాలని జెడ్పీ సీఈవో జె.మోహనరావు కోరారు.

యార్డులో 1,06,842 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,01,900 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,06,842 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,642 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పోషకాహారం



బల్లికురవ: ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతి రోజూ మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందని, ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు అవగాహన పెంచాలని ఆర్జేడీ వీవీ సుబ్బారావు, బాపట్ల డీఈవో పీవీజే రామారావు ఆదేశించారు. గురువారం మండలంలోని వేమవరం, పాతమల్లాయపాలెం, నక్కబొక్కలపాడు పాఠశాలలను ఆర్జేడీ, డీఈఓలు వేర్వేరుగా తనిఖీ చేశారు. వేమవరంలో విద్యార్థులు రాసిన వర్క్‌బుక్‌లో లోపాలను సక్రమంగా చూడకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత మల్లాయపాలెంలో పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లపై అవగాహనతో విద్యార్థులకు బోధిస్తుండటంతో హెచ్ఎం ఎస్ ప్రభాకరరావు, ఉపాధ్యాయులను ఆర్జేడీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తనిఖీలో ఎంఈవో బీ.వీరరాఘవయ్య పాల్గొన్నారు.

మేలుజాతి సంతతికి ప్రాణం



ల్యాబ్‌లో వృద్ధి చేసిన పిండాన్ని నాటు గేదె గర్భంలో ప్రవేశపెడుతున్న దృశ్యం



నెల్లూరు జిల్లా చింతలదీవి ల్యాబ్‌లో పిండాలను వృద్ధి చేస్తున్న శాస్త్రవేత్తలు

- ఐవీఎఫ్ విధానంతో పిండమార్పిడి పథకం
- రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేలు జాతి పిండాల వృద్ధి
- పాడి రైతుపై భారం పడకుండా ఉచితంగా అమలు
- కొత్త విధానాన్ని స్వాగతించి ఆర్థిక అభ్యున్నతి చెందాలని ప్రభుత్వ సూచన

యడ్లపాడు: పాడి రైతుల జీవన విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వత్రా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మేలుజాతి పశువుల ఉత్పత్తి, ఆయా పశువుల నుంచి అత్యధిక పాల దిగుబడి వచ్చేలా చేయడం..తద్వారా మార్కెట్‌లో మంచి ఆదాయం లభించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాడి రైతులకు పలు పథకాలను అమల్లోకి తెస్తున్నారు. ఇప్పటికే అమలవుతున్న పిండోత్పత్తి పథకం, పెయ్య దూడల పథకాలకు భిన్నంగా తాజాగా మరో పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. పూర్తి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మూడు తరాలకు తయారయ్యే మేలురకం జాతి దూడను నేటి తరంలోనే నేరుగా పుట్టించేలా చేసే పిండమార్పిడి(ఎంబ్రియో ట్రాన్స్ఫర్ టెక్నాలజీ)ని అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ స్వయంగా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని పిండమార్పిడి పద్ధతిని విజయవంతం చేయడం విశేషం. ఈ పథకాన్ని రాష్ట్రంలో వీలైనంత ఎక్కువ పశువులకు వర్తింపు జేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇకపై గేదెల్లోనూ పిండమార్పిడి విధానం

ఇప్పటి వరకు పిండమార్పిడి విధానం ఆవుల్లో మాత్రమే (ఒంగోలు, గిర్ జాతులు) చేసేవారు. మన రాష్ట్రంలో పాడిరంగంలో గేదెలకు, వాటి పాల ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానంపై శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించింది. గుంటూరు జిల్లా లాం, నెల్లూరు జిల్లా చింతలదీవిలో ఫామ్‌లలో దీనిపై రెండేళ్లు శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేశారు. రెండు ల్యాబ్‌ల పరిధిలో పిండమార్పిడి విధానంతో మేలుజాతి రకాలైన ఐదు దూడలను పుట్టించారు. వారి పరిశోధనలు పూర్తిస్థాయి విజయం సాధించిన తర్వాతనే దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆడ, మగ వేర్వేరు పశువుల నుంచి సెమన్, అండం సేకరించి వాటిని నాటు పశువు గర్భంలో ప్రవేశపెడతారు. ఫలితంగా ముర్రా జాతికి చెందిన మేలురకం దూడకు జన్మనివ్వడం జరుగుతుంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా కేంద్ర సహకారంతో తలపెట్టిన ఈ పథకం అమలుకు ఒక్కొక్క పశువుకు రూ.1000 ఖర్చు అవుతున్నప్పటికీ పాడి రైతుల అభ్యున్నతే పరమావధిగా భావించి రాష్ట్ర ప్రభుత్వమే భరించి ప్రస్తుతం ఉచితంగానే అందిస్తుంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో..

శిక్షణ పొందిన వైద్యనిపుణుల ద్వారా రైతులకు తొలిసారిగా ఈ పథకాన్ని పరిచయం చేస్తుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని ఐదుగురు వైద్యులకు ఈ పథకంపై రెండు విడతలుగా నెలరోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గతంలో ఆవుల్లో మాత్రమే ఉన్న పిండమార్పిడి పద్ధతి (ఎంబ్రియో ట్రాన్స్ఫర్ టెక్నాలజీ) ఇప్పుడు పశువులకు అందుబాటులోకి తెచ్చారు. నాటు పశువులకు ఒక జనరేషన్‌లోనే మేలురకం దూడలు పుట్టేలా చేసి పశుసంపద వృద్ధి, పాడిరైతు ఆర్థిక ప్రగతి ఏకకాలంలో సాధించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. సరోగెటివ్ మదర్ పశువులు కలిగిన పాడిరైతులు ఈ పథకాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవచ్చు.

అధిక పాలసార గల పశువుల ఉత్పత్తే లక్ష్యం



పిండమార్పిడి ద్వారా పాలసార గల పశువుల్ని ఉత్పత్తి చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. గతంలో ఇది ప్రయోగశాల వరకే ఉండేది. ప్రస్తుతం వీటిపై పశువైద్యులకు ప్రత్యేక శిక్షణ, సదుపాయాలను ఇచ్చి క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చేస్తున్నాం. గుంటూరు, నెల్లూరులోని ల్యాబ్‌ల్లో ఉత్పత్తి చేసిన పిండాల్ని సమన్వయంతో పాడిరైతుల వద్దకే తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నాం. ఇందుకు రైతుల స్పందన బాగుంది. ఈ ఏడాది జూన్, జులై నాటికి ఇంకొందరు పశువైద్యులకు శిక్షణ ఇచ్చి పెద్దఎత్తున పథకం సక్సెస్ అయ్యేలా ప్రణాళిక చేస్తున్నాం. కొత్త విధానం కాబట్టి రైతులు సహకారం అందిస్తే తప్పక మేలుజాతి రకం దూడల్ని వృద్ధి చేస్తూ భవిష్యత్తులో అధిక పాల ఉత్పత్తిని సాధించే వీలుంది. డెయిరీ ఫాంలు ఉన్న రైతులు తమ పశువుల అండాల్ని ఇస్తే వాటిని పిండాలుగా మార్చి వారి పశువులతో పాటు ఇతర రైతుల పశువులకు అందించే అవకాశం ఉంటుంది.

– ఎం శ్రీనివాసరావు, సీఈవో ఏపీఎల్‌డీఏ



● ఆత్మీయ స్వాగతం

విశాఖపట్నంలో రెండు రోజులపాటు జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్(జీఐఎస్)లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం అక్కడి ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని. – సాక్షి ఫొటోగ్రాఫర్

జీబీసీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం

ముప్పాళ్ల: గుంటూరు బ్రాంచి కాలువలోకి కారు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు సురక్షితంగా బయటపడ్డారు.సంఘటన గురువారం తెల్లవారుజామున పలుదేవర్లపాడు సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన రూపెనగుంట్ల ఘన్‌సైదా, భార్య మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు రావాలంటూ సైదా భార్య ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గంగిరెడ్డిపల్లిలోని తమ్ముడు దూదేకుల నరసింహారావుకు కబురు చేసింది. ఆయన తన మిత్రుడు తుంగా సాయికుమార్‌తో కలిసి కారులో పలుదేవర్లపాడు గ్రామానికి వచ్చారు. ఇరువురి మధ్య వివా దం పెరగటంతో కారులో తిరుగు ప్రయాణమయ్యా రు. అప్పటికే తెల్లవారుజాము కావటంతో వారి వెనకాలే ఘన్‌సైదా బయలుదేరాడు. ఊరు దాటాక గుంటూరు బ్రాంచి కాలువ వద్ద మలుపు ఎక్కే క్రమంలో కారు నేరుగా కాల్వలోకి దూసుకెళ్లింది. వెనకాలే వస్తున్న ఘన్‌సైదా సమాచారాన్ని పోలీసులకు అందించారు. సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు కారులో ఉన్న ఇరువురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కారును క్రేన్‌తో స్థానికులు బయటకు తీశారు.



కాలువ నుంచి కారును బయటకు తీస్తున్న స్థానికులు

దేశ సేవకు మంచి అవకాశం

- ఆర్మీ అగ్ని వీర్ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు
- 15 లోపు ఆసక్తి కలిగిన యువత ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- పల్నాడు కలెక్టర్ శివశంకర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఆర్మీ కల్నల్ పునీత్, డీఆర్ఓ వినాయకం

సాక్షి, నరసరావుపేట: భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనుకున్న యువతకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో గురువారం ఆర్మీ కల్నల్ పునీత్‌తో కలసి 'ఆర్మీ అగ్ని వీర్' ఉద్యోగ నియామకాలపై మీడియాతో మాట్లాడారు. భారత సైన్యంలో అగ్నివీర్ ద్వారా ఉద్యోగ నియామకం పొంది, దేశానికి సేవ చేయాలనుకొనే వారికి సదావకాశమని కలెక్టర్ తెలిపారు. భారత్ ప్రభుత్వం ఆర్మీ రిక్రూట్మెంట్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపారు.

2023, ఫిబ్రవరి నాటికి 17 సంవత్సరాలు వయసు నిండి, 21 ఏళ్ల వయసు లోపు వారికి అగ్ని వీర్ ఆర్మీ ఉద్యోగ అవకాశం పొందటానికి అర్హతని వివరించారు. పదో తరగతి విద్యార్హత పూర్తి చేసిన వారికి జనరల్ డ్యూటీ, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన వారికి సాంకేతిక (టెక్నికల్), నర్సింగ్ విభాగాల్లో ఆర్మీహెల్త్ నియామకాలను చేపడుతుందని తెలిపారు. మన ప్రాంతానికి సంబంధించి గుంటూరు, చీరాలలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పూర్తి స్థాయి పారదర్శకంగా ఆన్ లైన్ ద్వారా 'జేఐఏ' (జాయిన్ ఇండియన్ ఆర్మీ. ఎన్ఐసి. ఇన్) పోర్టల్ ద్వారా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఉద్యోగ నియామకానికి సంబంధించి మార్చి 15 లోపు ఆసక్తి కలిగిన యువత ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వచ్చే సందేహాల నివృత్తి కోసం ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో హెల్ప్ డెస్క్‌ను పరిశీలించాలన్నారు. ఏప్రిల్ 17న వీటికి సంబంధించిన పరీక్ష జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఆర్మీ ఉద్యోగఅవకాశాలకు దరఖాస్తు చేసుకుని ఉద్యోగావకాశాలను పొందాలని సూచించారు. వచ్చే ఏడాది నిర్వహించే ఆర్మీ రిక్రూట్మెంట్ విధానం పల్నాడు జిల్లా నుంచి అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఆర్మీ కల్నల్ పునీత్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ విధానం, రిజిస్ట్రేషన్, ఆన్లైన్ పరీక్ష, ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్, ఉద్యోగ నియామకం, ఉద్యోగంలో చేపట్టాల్సిన విధులు, విధానాలు తదితర అంశాలను మీడియాకు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు పాల్గొన్నారు.

వీసా ఇప్పిస్తానంటూ మోసం

ముప్పాళ్ల: విదేశాలకు వెళ్లేందుకు వీసా ఇప్పిస్తానంటూ రూ.56లక్షలు తీసుకొని మోసం చేశాడంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య గురువారం తెలిపారు. మండలంలోని లంకెలకూరపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యర్రం అశోక్‌రెడ్డి విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన వీసా, ఉద్యోగం ఇప్పిస్తానంటూ మదనపల్లికి చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోరెడ్డి కిశోర్‌రెడ్డికి రూ.56లక్షలు వరకు ఇచ్చాడు. 2019, మే నెల నుంచి విడతల వారిగా సొమ్ము తీసుకొని మోసం చేశాడన్నారు. జరిగిన సంఘటనపై న్యాయం కోరుతూ పోలీసులను ఆశ్రయించగా బాధితుడి ఫిర్యాదు మేర కేసు నమోదు చేశామన్నారు.

పెరుగుతున్న వినికిడి సమస్యలు

నేడు వరల్డ్ హియరింగ్ డే

- ఆధునిక జీవన శైలితో సమస్య తీవ్రతరం
- ముందస్తుగా వినికిడి సమస్యను గుర్తించవచ్చు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు



వినికిడి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

గుంటూరుమెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల యువత వినికిడి సమస్య బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పది మందిలో ముగ్గురికి వినికిడి సమస్య ఉంటుంది. వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నివారించవచ్చు. కానీ అనేక మందికి సమస్యపై అవగాహన లేకపోవడం వల్ల ప్రాథమిక దశలో చికిత్స చేయించకుండా చెవిటివారిగా మారిపోతున్నారు. వినికిడి లోపం వల్ల మాటలు రావు. వినికిడి సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా మార్చి 3న వరల్డ్ హియరింగ్‌డే నిర్వహిస్తున్నారు. వినికిడి లోపం రావడానికి కారణాలు, వాటిని ఏవిధంగా నిర్ధారించాలనే విషయాలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వినికిడి లోపం కారణాలు

పుట్టుకతో వినికిడి శక్తి లోపానికి ప్రధాన కారణం జన్యుపరమైనవే. పుట్టుకతో 70 శాతం వినికిడి లోపం మేనరికపు వివాహాల వల్ల వస్తుంది. వినికిడిలోపం రావడానికి నవజాత శిశువుగా ఉన్నప్పుడు కామెర్ల వ్యాధి సోకడం, ఆక్సిజన్ లోపం వల్ల వస్తుంది. గర్భంలో బిడ్డ ఉన్నప్పుడు తల్లి సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, గర్భవతికి ఏమైనా ఇన్‌ఫెక్షన్లు సోకడం వల్ల పుట్టబోయే బిడ్డకు వినికిడి సమస్య వస్తుంది. శబ్ద కాలుష్యం ద్వారా 16 శాతం మందిలో వినికిడి లోపం వస్తుంది. శబ్దాన్ని 140 డెసిబిల్స్ మించి దగ్గరగా విన్నా, 70 డెసిబిల్స్‌పై శబ్దాన్ని ఎక్కువ కాలం విన్నా వినికిడి లోపం వస్తుంది. మన దేశంలో వాహన శబ్ద కాలుష్యం పరిమితి స్థాయి దాటి ఉండటం వల్ల పట్టణాల్లో ఎక్కువ సమయం గడిపేవారు వినికిడి సమస్యకు గురవుతున్నారు. వృద్ధాప్యం వల్ల సర్వసాధారణంగా వినికిడి లోపం వస్తుంది. కొన్ని రకాల మందులు వాడడం వల్ల కూడా వినికిడి లోపం వస్తుంది. సుమారు 200 రకాల ఔషధాలు వినికిడి శక్తిని తగ్గిస్తాయని పరిశోధనలో తేలింది. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులకు వాడే మందులు వినికిడి శక్తిని తగ్గిస్తాయి. తలకు, లేదా చెవికి బలమైన దెబ్బతలగడం వల్ల చెవి మధ్యలో ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల వినికిడి సమస్య వస్తుంది.



రోజుకు ఐదు నుంచి పది మందికి చికిత్స

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది ఆడియాలజిస్టులు ఉన్నారు. వారంలో ఒక్కో ఆడియాలజిస్టు 5 నుండి 10 మంది పిల్లలకు చెవుడు, మూగ సమస్యకు చికిత్స అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడువేల మంది పిల్లలు వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ నివేదిక వెల్లడిస్తుంది. వినికిడి శక్తి పరీక్షలను ఆడియాలజీ సెంటర్‌లలో చేస్తారు.

ముందస్తు జాగ్రత్తలు



పెద్ద శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్య వస్తుంది కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ సేపు పాటలు వినడం మానేయాలి. చెవిలో పిన్నులు, పుల్లలు, ఇతర వస్తువులు పెట్టుకుని తిప్పుకోకూడదు. ఇయర్ ప్రొటెక్టివ్ డివైజర్స్ వాడాలి. షుగర్ ఉన్నవారు, డిప్రెషన్‌తో బాధపడేవారు తప్పనిసరిగా ఏడాది కొకసారి వినికిడి పరీక్ష చేయించుకోవాలి. చెవి ఇన్‌ఫెక్షన్‌లను త్వరితగతిన తగ్గించుకునేలా వైద్యులను సంప్రదించాలి. ప్రాథమిక దశలో నిర్లక్ష్యం చేస్తే వినికిడి సమస్య ఏర్పడుతుంది.

– ఆర్.శిరీష, ఆడియాలజిస్టు అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్టు, గుంటూరు

ఉచితంగా ఆపరేషన్‌లు



పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న పిల్లలకు మూడు నుంచి ఐదేళ్లలోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేస్తే ఫలితం ఉంటుంది. దేశంలో మొట్టమొదటిసారిగా ఏపీలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండు చెవులకు కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేసే విధంగా ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. సుమారు ఒక్కో చెవికి రూ.8 లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

– డాక్టర్ బయ్యా సుధీర్, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్, గుంటూరు



గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సి.లాజరస్, బ్రదర్ అబ్రహాం



ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన విశ్వాసకులు

భక్తి 'గుడారం'.. స్తుతి నైవేద్యం

గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో 46వ గుడారాల పండుగ భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యింది. గురువారం తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి. లాజరస్ సభను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్‌లు ఫ్రెడిపాల్, రాజు, రమేష్, జాన్ వెస్లీ హాజరయ్యారు. పాస్టర్ జాన్‌వెస్లీ వాక్యసందేశం అందిస్తూ ఏసుక్రీస్తు యదార్థవంతుడు, న్యాయమంతుడని అన్నారు. భయభక్తులు కలిగిన వారికి ఆయన కృప ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయనను నమ్మినవారికి సంక్షేమాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధి, విజయాభివృద్ధి కలుగుతుందని వివరించారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ ఈ పండుగలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. – గుంటూరు రూరల్

మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

రాష్ట్ర పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్

సత్తెనపల్లి: భారతదేశాన్ని మనువాద కార్పొరేట్, మతోన్మాద శక్తుల నుంచి రక్షించుకోవాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగే భారత్ బచావో జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జన విజ్ఞాన వేదిక పట్టణ శాఖ ఆధ్వర్యంలో కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు న్యాయవాది ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి లౌకిక తత్వానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్ బాబు, కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జానీ ఖాజావలి, బహుజన సమాజ్ పార్టీ కన్వీనర్ బొక్క సంగీతరావు, జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ జొన్నలగడ్డ విజయకుమార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల కోటేశ్వరరావు, సీపీఐ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడిగా చినఓబయ్య


పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికను గురువారం శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్లె పోగు సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్నాడుజిల్లా అధ్యక్షుడిగా చింతా చినఓబయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నాగమునెయ్య, మహిళా కార్యదర్శిగా కె.నాగరాజకుమారి, కోశాధికారిగా ఎ.మహేష్, గౌరవాధ్యక్షుడిగా బొడ్డుపల్లి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్కా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.భాస్కరరావు వ్యవహరించారు.

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, కడుపునొప్పితో బాధపడ్డ 34 మంది విద్యార్థులు
- సకాలంలో వైద్యచికిత్స అందించడంతో అందరూ కోలుకున్న వైనం
- శావల్యాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఘటన


ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్యులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి 34 మంది విద్యార్థులు అస్వస్థత గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు పాఠశాలలో 120 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నారు. అందులో 3 నుంచి 5వ తరగతి మధ్య ఉన్న చిన్నారులు 34 మంది ఒక్కసారిగా కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, కళ్లు తిరగటం తదితర లక్షణాలతో బాధపడ్డారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం జాలాది నాగశ్రీనివాసరావు, ఉపాధ్యాయులు స్థానిక వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మికి ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. హుటాహుటీన పాఠశాలకు చేరిన వైద్యులు విద్యార్థులకు ప్రాథమిక వైద్యం చేశారు. వారిలో 11 మంది వెంటనే కోలుకున్నారు. మిగిలిన 23 మంది వాంతులు, కడుపునొప్పితో బాధపడుతుండగా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి పర్యవేక్షణలో స్టాఫ్‌నర్సులు ప్రమీల, ధనలక్ష్మి, ఫార్మాశిస్ట్ లక్ష్మీనారాయణ వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో విద్యార్థులకు వైద్యసేవలు అందించారు. జిల్లా జేసీ శ్యాంప్రసాద్ జరిగిన ఘటనపై నేరుగా వైద్యాధికారికి ఫోన్ చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గల్లా రవికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొణతం ఏరుకలరెడ్డి, చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీనువాసరావు, ఆర్‌ఐ బాబు ఆరోగ్య కేంద్రం సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులందరికీ సకాలంలో వైద్య సేవలు అందించిన వైద్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విద్యాశాఖాధికారులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా శావల్యాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసి అస్వస్థతకు గురైన సంఘటనలో తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత విద్యాశాఖాధికారులపై చర్యలకు ఉపక్రమించారు. మండల విద్యాశాఖ అధికారి సాంబశివరావు, పాఠశాల హెచ్‌ఎం జె. శ్రీనివాసరావులకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనం పథక అధికారి ఎం.వెంకటేశ్వర్లు విధుల నుంచి సస్పెండ్ చేశారు. అంతేకాకుండా సరైన సమాచారం ఇవ్వనందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్యకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భోజన శాంపిళ్లు ల్యాబ్‌కు పంపించి పరీక్షించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, ఈ సంఘటనలో 3 నుంచి 5వ తరగతి చదువుతున్న 34 మంది విద్యార్థుల్లో 23 మంది అస్వస్థతకు గురికాగా, వారికి శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం డిశ్చార్జి చేశారు.

విద్యార్థులంతా క్షేమం

డీఎంహెచ్‌ఓ ఎం.శోభారాణి


ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపేందుకు పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ ఎం.శోభారాణి, రాష్ట్రీయ బాల సురక్ష యోజన అధికారి హనుమాకుమార్ పర్యవేక్షణలో ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు, సహచర ఉపాధ్యాయులను విచారణ చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 600 మంది విద్యార్థులు ఉండగా 137 మంది మధ్యాహ్న భోజనం తిన్నారన్నారు. వీరిలో 34 మంది అస్వస్థతకు గురికాగా, అందరూ కోలుకున్నారన్నారు. సాంబారు అన్నం వాసన వచ్చినట్లు విద్యార్థులు చెప్పినట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి వివరాలు సేకరించామన్నారు. రెండు రోజుల పాటు హైస్కూల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కందిపప్పు, సాంబారు పొడి, రైస్ తదితరాలన్నీ శాంపిల్‌గా తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతో పాటు వైద్యాధికారులు సయ్యద్ ఇబ్రహీం, వేముల వెంకట భాస్కర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



గుంటూరు ఈస్ట్: లాం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, షేక్ ఆలియా దంపతుల రెండు సంవత్సరాల కుమార్తె హసీదాను గురువారం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఇంటి ముందు ఆడుకుంటున్న తమ కుమార్తెపై శునకాలు దాడిచేశాయని చెప్పారు. గాయపడిన తమ కుమార్తెకు అదేరోజు జీజీహెచ్‌లో మొదటి డోసు ఇంజక్షన్ వేయించామన్నారు. రెండో డోసు ఇంజక్షన్ వేయించేందుకు గురువారం జీజీహెచ్‌కు వచ్చామన్నారు. తమ కుమార్తెపై శునకాలు దాడిచేసిన విషయాన్ని లాం గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేశామని, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుమార్తె మొఖం, చేతులు, వీపుపై పలు చోట్ల కుక్కలు తీవ్రంగా కరిచాయని వివరించారు.

చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు నగరంలో ఓ నివాసంలో భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో గురువారం ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.సీతారామయ్య, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం యాదగిరి గుట్టమండలం యాదగిరిపల్లెకు చెందిన క్లెం రవికుమార్ అలియాస్ పత్తి రవి అలియాస్ ఆర్కే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం పలు చోరీలకు పాల్పడ్డాడు. అనంతరం గుంటూరు జిల్లా పెదకాకానిలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేయడం ప్రారంభించాడు. ఈక్రమంలో ఫిబ్రవరి 6వ తేదీ తిరుపతి వెళ్లిన గుంటూరు చౌత్రాసెంటర్, పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన నూకల మురళీకృష్ణ నివాసంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న బీరువాలోని బంగారాన్ని దోచుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ కోసం యత్నించగా, గురువారం గుంటూరు చౌత్రా సెంటర్‌లో దొంగిలించిన బంగారం విక్రయించేందుకు వచ్చినట్లు గుర్తించి, పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించారు. నిందితుడి వద్ద 373 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐలు ఆర్.ఎం.విజయ్‌కుమార్, కె.అమర్‌వర్ధన్, కానిస్టేబుళ్లు నాగూర్‌వలి, రవి, సుబ్బారావు, కిరణ్‌లను అభినందించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 546.80 అడుగుల వద్ద ఉంది. ఇది 202.7842 టీఎంసీలకు సమానంగా ఉంది. కుడికాలువకి 10,120, ఎడమకాలువకు 9,166, జలవిద్యుత్ కేంద్రానికి 20,026, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీతోనే సామాజిక సమానత్వం

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా రాజుపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న మంత్రి అంబటి, వేదికపై, ఎంపీ లావు, ఎమ్మెల్సీ డొక్కా, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, గోపిరెడ్డి, శంకరరావు

రాజుపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు, సరికొత్త ఆలోచనలతోనే బడుగు బలహీన వర్గాల వారికి నియామక పదవుల్లోను రిజర్వేషన్‌లు లభించాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాజీ మంత్రి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌తో కలసి రాష్ట్ర మంత్రి అంబటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ అధ్యక్షతన జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి అంబటి మాట్లాడుతూ గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అట్టడుగు వర్గాల వారికి అవకాశం కల్పించి, సామాజిక సమానత్వం వైపు నడిపిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు సింగిల్‌గానే పోటీ చేస్తుందని, సీఎం జగన్ దమ్మున్న నాయకుడని, ప్రజలు మనస్సు గెలుసుకున్న లీడర్ అని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో దుష్ట చతుష్టంపైనే మన పోరాటం అన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణ్యి వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రెండు మార్కెట్ యార్డు పదవులను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడం నిజంగా స్ఫూర్తి దాయకమని, అంబటి నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించడం ప్రభుత్వాల భాద్యత అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి పక్షాలు ప్రజలతో మమేకం కాకుండా పచ్చపత్రికలపైనే ఆధారపడుతున్నాయని అన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావులు మాట్లాడుతూ ఎస్టీ మహిళకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కల్పించడం అభినందనీయమన్నారు. తొలుత అతిథులను వేదిక వద్దకు కార్యకర్తలు 2కిలో మీటర్ల దూరం బైకు ర్యాలీతో తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌ను, రాష్ట్రమంత్రి అంబటిని జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ ఆధ్వర్యంలో భారీ గజమాలతో సత్కరించారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.హనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, తాడిశెట్టి మురళి, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న యార్డు కార్యదర్శి

రాజుపాలెం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా కొండ్రెడ్డి సుజాత

రాజుపాలెం: రాజుపాలెం మార్కెట్ యార్డు అభివృద్ధికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కృషితో కృషి చేస్తానని నూతన కమిటీ చైర్‌పర్సన్ కొండ్రెడ్డి సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాజుపాలెం మార్కెట్ యార్డు కమిటీ నూతన పాలక వర్గ సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు ఉంటారు. యార్డు చైర్మన్‌గా కొండ్రెడ్డి సుజాత(మొక్కపాడు) వైస్ చైర్మన్‌గా పూల ధనమంత్రి(కుంకలగుంట)లు ముందుగా ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా వేల్పుల లక్ష్మయ్య(ఉప్పలపాడు), నల్లగొర్ల తిరుపతమ్మ(అనుపాలెం), బత్తుల నాగేంద్రమ్మ(నెమలిపురి), దేవిరెడ్డి లక్ష్మీరెడ్డి (కోటనెమలిపురి), చికిలి మస్తాన్‌వలి(గుళ్లపల్లి), మూల ధనలక్ష్మీ(నర్సింగపాడు) కోర్నే మల్లేశ్వరి(రూపెనగుంట్ల), బెల్లంకొండ శివపార్వతి(నకరికల్లు), లింగాల చిన్నమ్మాయి(ఇనిమెట్ల), మురికిపూడి చిన్న నాగేశ్వరరావు(నకరికల్లు) షేక్ మహబూబ్ కమల్‌బాషా(రెడ్డిగూడెం), కాంద్రు భిక్షమయ్య(చాగల్లు), నిమ్మకాయల వీరాంజనేయులు(రాజుపాలెం), పులిబండ్ల అశోక్(సర్పంచ్, రాజుపాలెం)లచేత మార్కెట్ యార్డు కార్యదర్శి ఆంజనేయసింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల ప్రాణాలను నిలబెట్టాల్సిందే

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- వైద్యాధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, పక్కన డీఎంహెచ్‌ఓ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో హై-రిస్క్ గర్భిణుల మరణాల నివారణకు వారికి అత్యవసర ప్రాణాంతక సమయంలో వైద్య ఆరోగ్యశాఖ, సిబ్బంది తప్పనిసరి పర్యవేక్షణ చేపట్టి ప్రాణాలను నిలబెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో మాతృమరణాల నివారణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గతేడాది అక్టోబరు నెల నుంచి 2023 ఫిబ్రవరి నెల మొదటి వారం నాటికి జరిగిన ఐదు మాతృమరణాలపై సమీక్ష చేశారు. అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో అటువంటి మరణాలు సంభవించకుండా తీసుకోవలసిన చర్యలు, ఏ స్థాయిలో లోపం ఉందో గమనించి, మానవ తప్పిదాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్య విధానం అమలు విషయంలో ఎక్కడా లోపం లేకుండా, అవసరమైన వనరులను, వసతులను వెంటనే ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యతో వచ్చిన ప్రతి గర్భిణీకి పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, లోపాలను గుర్తించి సక్రమ వైద్య సేవలను అందించి, సుఖవంతమైన ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజుపాలెం, కావూరు, నాదెండ్ల, 75 తాళ్లూరు, ఫణిదం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మరణాలపై సమీక్షలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. మాతృమరణాలు జరిగిన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు పారా మెడికల్ సిబ్బంది, బాధిత కుటుంబాలతో మాట్లాడి తగిన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రధానంగా థైరాయిడ్‌తో బాధపడే ప్రతి గర్భిణికి ఈసీఓ, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు జరిగేలా చూడాలని, ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం ప్రభుత్వ సహకారంతో ఆరోగ్యశ్రీ ఉచిత సేవలు గర్భిణులకు తప్పనిసరిగా అందాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, డీసీహెచ్ డాక్టర్ రంగారావు, గైనకాలజీ వైద్య నిపుణులు, పలువురు జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.